క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కాజీపేట అర్బన్: వరంగల్ టౌన్ పరిధిలోని శంభునిపేట సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులో భాగంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వరంగల్ టౌన్ డీఈ మల్లికార్జున్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు పోచమ్మమైదాన్ సర్కిల్, కల్యాణినగర్, టీచర్స్ కాలనీ, ఏకశిలనగర్, నవయుగ కాలనీ, గణేష్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్, ఎమ్మార్వో ఆఫీస్, ఏఎస్ఎం కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. హనుమకొండలోని యాదవనగర్, కేయూసీ సబ్‌స్టేషన్ల పరిధిలో మంగళవారం పలు విద్యుత్ అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈఈ జి.సాంబరెడ్డి తెలిపారు. యాదవనగర్ సబ్ స్టేషన్ పరిధిలోని కొత్తూరు జెండా, చర్చి, మార్కెట్ రోడ్డు బ్యాక్ సైడ్, రెడ్డికాలనీ, భగత్‌సింగ్ నగర్, గోపాల్‌రావు బిల్డింగ్, యాదవనగర్, తోటబడి ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి 11.30 వరకు, కిషన్‌పుర సబ్‌స్టేషన్ పరిధిలోని కిషన్‌పుర, లష్కర్‌బజార్ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

ఐపీసీ, రాక్ చీఫ్ ఇంజనీర్‌గా వెంకటరమణ

హన్మకొండ: ఐపీసీ, రాక్ చీఫ్ ఇంజనీర్‌గా టీజీ ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో కె.వెంకటరమణ బాధ్యతలు చేపట్టారు. హనుమకొండ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న కె.వెంకటరమణకు చీఫ్ ఇంజనీర్‌గా యాజమాన్యం పదోన్నతి కల్పించి ఐపీసీ రాక్ విభాగ సీఈగా నియమించగా, ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అలాగే, ఎన్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలోని ఆపరేషన్ విభాగంలో డీఈగా పనిచేస్తున్న శ్రీకాంత్‌కు సూపరింటెండెంట్ ఇంజనీర్‌గా పదోన్నతి కల్పిస్తూ డీపీఈ ఎస్ఈగా నియమించగా సోమవారం బాధ్యతలు చేపట్టారు.

ఓఎస్‌డీగా బాధ్యతల స్వీకరణ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా మ్యాథమెటిక్స్ విభాగం ప్రొఫెసర్ మల్లారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. తొలుత నియామక ఉత్తర్వులను వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం నుంచి అందుకున్నారు. ఏడాది పాటు ఓఎస్‌డీగా మల్లారెడ్డి బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

దాసరి కల్పనకు కలెక్టర్ సన్మానం



కాజీపేట అర్బన్: శాయంపేట మండలం స్వయం సహాయక సంఘ సభ్యురాలు దాసరి కల్పనను కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్య సోమవారం సన్మానించారు. ఇటీవల న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ గణతంత్ర దినోత్సవంలో రాష్ట్రవ్యాప్తంగా 12 మంది లక్‌పతి దీదీలు పాల్గొనగా అందులో కల్పనకు అవకాశం లభించింది. రూ.20 లక్షల వ్యయంతో నాన్ ఓవెన్ బ్యాగుల తయారీ కేంద్రాన్ని ఆమె శాయంపేటలో ప్రారంభించి ఆర్థికంగా రాణిస్తున్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ ఎం.శ్రీను, అడిషనల్ డీఆర్‌డీఓ సుధీర్, డీపీఎంలు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

సభ్యుల సంక్షేమానికే ప్రాధాన్యం



ఖిలా వరంగల్: సంఘం బలోపేతంతోపాటు సభ్యుల సంక్షేమానికే అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు శ్రీతారక రామ పరపతి సంఘ అధ్యక్షుడు బత్తిని లింగయ్య గౌడ్ అన్నారు. వరంగల్ లక్ష్మీనగర్‌లోని శ్రీతారక రామ పరపతి సంఘం భవనంలో ప్రధాన కార్యదర్శి రమేష్ అధ్యక్షతన సంఘం 40వ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు చింత పట్ల మురళి, దద్దనాల రాజేష్, టీకు మట్ల కుమారస్వామి, ఎనబోతుల రవికుమార్, మహారాజు భరత్, నెల్ల రాజు, కమట వేణుగోపాల్, రాజ్‌కుమార్, కోల రాజ్‌కుమార్, అయిలయ్య, వనమాల ప్రహ్లాద్, శివరాజు, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

నాన్ పార్కింగ్ స్థలంలో వాహనం నిలపరాదు

ఖిలా వరంగల్: నాన్ పార్కింగ్ స్థలాల్లో వాహనాలు నిలపరాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే సదరు వాహనాలను సీజ్ చేస్తామని వరంగల్ ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కేఎస్ఆర్ కృష్ణ అన్నారు. వరంగల్ రైల్వేస్టేషన్‌లో పరిధిలోని నాన్ పార్కింగ్ స్థలాల్లో వాహనాలు నిలిపి ఉంచిన వాహనచోదకులకు ఎస్ఐపీఎఫ్ జి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ కృష్ణ మాట్లాడుతూ వరంగల్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని పార్కింగ్ స్థలంలోనే పార్క్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇంపీరియల్ కాలనీలో సమస్యల తిష్ట

- ధ్వంసమైన అంతర్గత రోడ్లు
- అధ్వానంగా డ్రెయినేజీ వ్యవస్థ
- పైపులైన్ల లీకేజీలతో తాగునీరు వృథా

కాజీపేట రూరల్: కాజీపేట 47వ డివిజన్‌లోని ఇంపీరియల్ కాలనీ ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. డీజిల్‌కాలనీ మెయిన్ రోడ్డు నుంచి ఇంపీరియల్ కాలనీలోనికి ప్రవేశించే రోడ్డు ధ్వంసమైంది. దాంతో వాహనదారులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది.



ఇంపీరియల్ కాలనీలో ధ్వంసమైన రోడ్డు

కాల్వల్లో పిచ్చిమొక్కలు పెరగడంతో మురుగు నీరు ముందుకు వెళ్లకుండా నిల్వ ఉండడంతో దోమలు అధికమై స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. అక్కడక్కడ మున్సిపల్ పైపులైన్లు లీకేజీలు కావడం



డ్రెయినేజీలో పెరిగిన పిచ్చి మొక్కలు

తో తాగునీరు వృథా అవుతోంది. కాలనీలో పోచమ్మ గుడి చుట్టూ ప్రహరీ నిర్మించాలని, కమ్యూనిటీ హాల్‌లో డైనింగ్ హాల్, టాయ్‌లెట్ సౌకర్యం కల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

తెలంగాణపై కేంద్రంలోని బీజేపీ వివక్ష

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

హన్మకొండ: తెలంగాణకు నిధులు తీసుకురావడంలో విఫలమైన కేంద్ర మంత్రులు జి.కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ కేంద్ర మంత్రివర్గం నుంచి వైదొలగాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్షను ఖండిస్తూ హనుమకొండ కాళోజీ కూడలిలో చేతిలో ఖాళీ చిప్పలతో నాయకులు సోమవారం వినూత్న నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కపట ప్రేమ చూపుతోందని ధ్వజమెత్తారు. ఏపీ పునర్విభజన చట్టం అమలును నిర్లక్ష్యం చేసిందని, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ములుగులోని తెలంగాణ



ఖాళీ చిప్పలతో నిరసన తెలుపుతున్న నాయకులు

గిరిజన విశ్వవిద్యాలయానికి నిధులు కేటాయించలేదని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఎస్.జ్యోతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్, నాయకులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, మోతె లింగారెడ్డి, కర్రె లక్ష్మణ్, ఉట్కూరి రాములు, యేష బోయిన శ్రీనివాస్, వేల్పుల సారంగపాణి, రవి, రాసమల్ల దీన, సదానందం పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం పోస్టర్ల ఆవిష్కరణ



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ (కో ఎడ్యుకేషన్), కరీంనగర్ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ డిజైన్ సంయుక్తంగా మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్ఎంఈ సహకారంతో ఈనెల 5నుంచి ఆరువారాల పాటు ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రోగ్రాం పోస్టర్లను క్యాంపస్‌లోని అకడమిక్ కమిటీ హాల్‌లో వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, ఓఎస్ ప్రొఫెసర్ మల్లారెడ్డి సోమవారం ఆవిష్కరించారు. కేయూ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రమణ, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ సహాయ సంచాలకులు రమ్యకృష్ణ, డాక్టర్ మహేందర్, డాక్టర్ సుమలత, డాక్టర్ ఆసిం ఇక్బాల్ పాల్గొన్నారు.

కులగణన రిపోర్టు ఆమోదయోగ్యం కాదు



లేఖను విడుదల చేస్తున్న బీసీ జేఏసీ నాయకులు

హన్మకొండ: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో బీసీ జనాభాను తక్కువ చేసి చూపించడం అశాస్త్రీయమని, ఆమోదయోగ్యం కాదని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాసిన లేఖను హనుమకొండలో సోమవారం విడుదల చేసి ఆయన మాట్లాడారు. కులగణన రిపోర్టులో బీసీలను 46.25 శాతంగా చూపించటం అంటే బీసీల వాస్తవిక లెక్కలను మరుగు పర్చడమేనని అన్నారు. 2015లో జరిగిన సమగ్ర కుటుంబ సర్వేలో తెలంగాణ రాష్ట్రంలో బీసీలు 51 శాతం ఉన్నారని నివేదిక వెలువడగా, పదేళ్ల తర్వాత పెరగాల్సిన బీసీ జనాభా 46 శాతానికి ఎలా పడిపోతుందని ప్రశ్నించారు. కార్యక్రమంలో బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ దారబోయిన సతీష్, ఆయా బీసీ సంఘాలు, వృత్తి సంఘాల నాయకులు ఆనందం, ఎదునూరి రాజమౌళి, పాలడుగుల సురేందర్, చిన్నాల యశ్వంత్ యాదవ్, ఎర బ్రోజు రమేష్, దాడబోయిన శ్రీనివాస్, వినయ్ చారి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

డబ్ల్యూపీఎస్ విద్యార్థి ప్రపంచ రికార్డు



కాజీపేట అర్బన్: హంటర్‌రోడ్డులోని వరంగల్ పబ్లిక్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న ఇమ్మడి అభిరామ్.. ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డులో చోటు సాధించాడని పాఠశాల కన్వీనర్ ఈరసాని వెంకట్రామిరెడ్డి తెలిపారు. పాఠశాలలో సాంస్కృతిక దినోత్సవం సందర్భంగా మహా భారతంలోని కర్ణుడి వేషధారణతో 5.30 నిమిషాల పాటు అనర్గళంగా ఏకపాత్రాభినయంతో అభిరామ్ అలరించాడని కొనియాడారు. ఈమేరకు పాఠశాల ఆవరణలో అభిరామ్‌ను సోమవారం అభినందించారు. డైరెక్టర్ శ్రీరాముల ఉమారాణి, అడిషనల్ డైరెక్టర్ గూడూరు జ్యోతి, ప్రిన్సిపాల్ గౌరి కల్యాణి, వైస్ ప్రిన్సిపాల్ కవిత, ప్రాథమిక తరగతుల ఇన్‌చార్జ్ పుష్పలత, ఉపాధ్యాయులు సోఫియా, మధుకర్, శోభారాణి, మాధవి, రమాదేవి పాల్గొన్నారు.

లైబ్రరీ సైన్స్‌తో ఉపాధి అవకాశాలు మెండు

కేయూ క్యాంపస్: లైబ్రరీ సైన్స్ కోర్సు విద్యార్థులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం అన్నారు. కాకతీయ యూనివర్సిటీలో ఎల్ఎల్ఐఎస్సీ విభాగంలో 2023 -2024లో అధిక మార్కులు సాధించిన ఎం.భాగ్యలక్ష్మికి ఖమ్మం జిల్లాకు చెందిన వెంకటి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అందించిన రూ.10 వేల నగదు పురస్కారాన్ని రిజిస్ట్రార్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా లైబ్రరీ సైన్స్ కోర్సు విభాగంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వెంపటి లక్ష్మీనారాయణ ట్రస్టు కన్వీనర్ డాక్టర్ రాంకిషోర్, ఎంఎల్ఐఎస్సీ విభాగం అధిపతి డాక్టర్ రాధికారాణి, రిటైర్డ్ కాలేజీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర బాధ్యుడు సత్యనారాయణ, కేయూ లైబ్రరీ సైన్స్ పూర్వ విద్యార్థుల సంఘం బాధ్యులు పుల్ల కిషోర్, వడ్డె రవిచంద్రరావు, సీకేఎం కాలేజీ లైబ్రేరియన్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.



బహుమతి అందిస్తున్న రామచంద్రం, రాంకిషోర్

సతీష్ సేవలు అభినందనీయం

హసన్‌పర్తి: ఎంతోమంది విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు కనుకుంట్ల సతీష్ సేవలు అభినందనీయమని రిటైర్డ్ పీజీ హెచ్ఎం గంటా రాంరెడ్డి అన్నారు. సతీష్ పదవీ విరమణ కార్యక్రమాన్ని నీరుకుళ్ల ప్రభుత్వ పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో భీమారంలో సోమవారం ఘనంగా నిర్వహించారు.

ఇద్దరు మంత్రులున్నా బడ్జెట్‌లో సున్నా



హన్మకొండ చౌరస్తా: అశోక జంక్షన్‌లో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

- కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామ్ నర్సింహారెడ్డి

హసన్‌పర్తి: రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులున్నా బడ్జెట్ కేటాయింపులో తెలంగాణకు కేంద్రం మొండిచెయ్యి చూపిందని కిసాన్ కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి విమర్శించారు. ఈమేరకు ఎర్రగట్టు జంక్షన్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్లు ఉదయ్‌కుమార్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ జక్కుల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కిరణ్, ఆరెల్లి వెంకటస్వామి, మదన్‌గౌడ్, రవి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతి, మాజీ వైస్ ఎంపీపీ రత్నాకర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై నిరసన

హన్మకొండ చౌరస్తా: బడ్జెట్‌లో తెలంగాణపై వివక్ష చూపెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకులు హనుమకొండలోని అశోకా జంక్షన్‌లో సోమవారం నిరసన తెలిపారు. డీసీసీ భవన్ నుంచి జంక్షన్ వరకు ర్యాలీగా తరలివచ్చారు. బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం జరిగిందన్నారు. టీపీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాసరావు, ఈవీ శ్రీనివాసరావు, కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, కార్పొరేటర్లు జక్కుల రవీందర్, మామిండ్ల రాజు, విజయశ్రీ, నాయకులు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నాయిని లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌పై కాంగ్రెస్‌వి అర్థంలేని విమర్శలు



ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

హన్మకొండ: కేంద్ర బడ్జెట్‌పై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న విమర్శలు అర్థం లేనివని, ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు దేశవ్యాప్తంగా ప్రశంసలు లభిస్తుంటే కాంగ్రెస్ పార్టీ విమర్శించడం విడ్డూరంగా ఉందని బీజేపీ హనుమకొండ జిల్లా మాజీ అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. ఈమేరకు హనుమకొండ దీన్‌దయాళ్ నగర్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో పేద, మధ్య తరగతి, యువత, రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ దేశ గతినే మార్చే అద్భుతమైన బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన అన్ని వర్గాల ప్రజల కలల బడ్జెట్ ఇది అని కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, నాయకులు డాక్టర్ కాళీప్రసాద్, ఆర్‌పి.జయంత్ లాల్, చొల్లేటి కృష్ణమాచారి, సంద్ర మధు, శ్రీనివాస్‌తో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలపై భారాలు మోపే బీజేపీ బడ్జెట్

ఖిలా వరంగల్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా, పేదలపై భారాలు మోపేవిధంగా ఉందని సీపీఎం వరంగల్ జిల్లా కమిటీ సభ్యురాలు నలిగంటి రత్నమాల విమర్శించారు. ఈమేరకు ఖిలా వరంగల్ పడమరకోట అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఎస్ఎఫ్ఐ, కేవీపీఎస్, సీఐటీయూ, ఐద్వా, పీఎన్ఎం సంయుక్త ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌పై సోమవారం నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు యారి ప్రశాంత్, చుక్క ప్రశాంత్, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి దుర్గయ్య పాల్గొన్నారు.

కాజీపేట అర్బన్: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ దేశాభివృద్ధికే శాపంగా ఉందని, ఇది పూర్తిగా తిరోగమన బడ్జెట్ అని సీపీఎం హనుమకొండ జిల్లా నాయకుడు కారు ఉపేందర్ విమర్శించారు. న్యూశాయంపేటలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను సోమవారం దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు కట్బోజు మదన్‌చారి, ఓరుగంటి సాంబయ్య, రజిత, రంజిత్, రమణయ్య, స్వరూప, భారతి తదితరులు పాల్గొన్నారు.



కాజీపేట అర్బన్: నిరసన తెలుపుతున్న నాయకులు

పోలీసు హాకీ జట్టుకు అభినందన



వరంగల్: ఇటీవల కరీంనగర్‌లో పోలీస్ శాఖ నిర్వహించిన రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడోత్సవాల్లో ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ ఎంఏ.షుకూర్ నేతృత్వంలోని హాకీ జట్టు రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా షుకూర్‌తో పాటు జట్టు సభ్యులను సీపీ అంబర్ కిషోర్‌ఝా అభినందించారు.

సంక్షిప్తంగా

ఎస్సీ వర్గీకరణ.. సామాజిక న్యాయమే

నయీంనగర్: ఎస్సీ వర్గీకరణ చేయడం సామాజిక న్యాయమేనని, ఈనెల 7న నిర్వహించనున్న లక్ష డప్పులు.. వేల గొంతుల మాదిగల భారీ ప్రదర్శనను మాదిగలు, సబ్బండ వర్గాలు, ప్రజాస్వామిక వాదులు విజయవంతం చేయాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు కొమ్ముల బాబు మాదిగ, ఒయాసిస్ విద్యాసంస్థల చైర్మన్ జేఎస్.పరంజ్యోతి పిలుపునిచ్చారు.

సేవాలాల్ జయంతిని సాధారణ సెలవుగా ప్రకటించాలి

నయీంనగర్: ఈనెల 15న సేవాలాల్ 286వ జయంతిని పురస్కరించుకొని ప్రభుత్వం సాధారణ సెలవు దినంగా ప్రకటించాలని గోర్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిలాల్ బోడా, జీబీఎస్ఎస్ఎస్ అధ్యక్షుడు బాలాజీ నాయక్, గోర్ సేన హనుమకొండ అధ్యక్షుడు తేజావత్ ఫణికుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల హామీలు నెరవేర్చాలి

కాజీపేట: కల్లుగీత కార్మికులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ డిమాండ్ చేశారు. కాజీపేట మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నర్సయ్య, తాళ్లపెల్లి రామస్వామి, గౌని సాంబయ్య, కోతి సాంబరాజు, నాగపురి రాజయ్య, మోడెం రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ ఆధారంగా విధులు కేటాయించాలి

కేయూ క్యాంపస్: ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలకు ప్రైవేట్ కళాశాలల అధ్యాపకులకు సర్వీస్ ఆధారంగా విధులు కేటాయించాలని తెలంగాణ ప్రైవేట్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులి శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పేట శ్రీనివాసులు, సిరంగి సుమన్ కోరారు.

దివ్యాంగుల దీనస్థితిపై పోరాడాలి

హన్మకొండ: దివ్యాంగులు దీనస్థితిలో ఉన్నారని, ప్రతిఒక్కరూ మద్దతు తెలిపి పోరాడాలని హనుమకొండ జులైవాడకు చెందిన దివ్యాంగుడు శ్రీధర్‌రావు కోరారు. హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌ను దివ్యాంగుడు శ్రీధర్‌రావు సోమవారం కలిశారు. ఈ సందర్భంగా తమ సమస్యలను శ్రీధర్ రావు ఏకరువు పెట్టాడు.

సోమిడిలో మహిళా ఆసరా స్టోర్ ప్రారంభం

కాజీపేట: ఓమ్ని మార్ట్ ఇండియా ఆసరా స్టోర్‌ను కాజీపేట మండలం సోమిడి గ్రామంలో కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో బిషప్ జాన్ మార్కండేయ, చీఫ్ ప్రాజెక్టు అధికారి బాకీ బైరెడ్డి, స్టోర్ కమ్యూనిటీ మిత్ర శ్రీవిద్య, డాక్టర్ మంద అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ విద్యారంగాన్ని బాగుచేస్తా..

నయీంనగర్: తనకు ఒక్క అవకాశం ఇస్తే తెలంగాణ విద్యారంగాన్ని బాగుచేస్తానని వరంగల్ – ఖమ్మం – నల్గొండ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి దామెర బాబురావు హామీ ఇచ్చారు. సమావేశంలో బొల్లె సాంబయ్య, జంగం సంజీవ్, శ్యామ్, మామిడి సురేష్, జయశంకర్ పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్

కాజీపేట అర్బన్: హంటర్‌రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో మహిళలకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్‌ను నిర్వహించనున్నట్లు మెడికవర్ వైద్యుడు అమతుల్ హెఫ్సా తెలిపారు. ఈమేరకు ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించి మాట్లాడారు.

షాపింగ్‌మాల్‌కు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలి

వరంగల్: వరంగల్‌లోని ఆజంజాహి మిల్లు కార్మికుల భవన స్థలంలో వ్యాపారి కాసం ఓంనమఃశివాయ నిర్మించతలపెట్టిన షాపింగ్ మాల్‌కు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని వరంగల్ జిల్లా ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకులు కోరారు. ఈమేరకు సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ డాక్టర్ సత్యశారదను కోరారు.

బీజేపీ ఆర్గనైజింగ్ సెక్రటరీకి సన్మానం

ఖిలా వరంగల్: బీజేపీ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్‌జీ ని వరంగల్ కరీమాబాద్‌కు చెందిన బీజేపీ మండల అధ్యక్షుడు బోరిగం నాగరాజు, తదితరులు సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం

వరంగల్: వరంగల్ – నర్సంపేట ప్రధాన రహదారిలోని హరిహర హోటల్ ఎదుట ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిన సంఘటనలో బైక్ నడుపుతున్న వ్యక్తి దుర్మరణం చెందినట్లు తెలిసింది. బైక్‌పై భార్యాభర్తలు వెళ్తూ రోడ్డు క్రాస్ చేసే సమయంలో నర్సంపేట – వరంగల్ వైపు వెళ్తున్న లారీ వేగంతో వచ్చి ఢీకొట్టడంతో ఈ ఘటన జరిగినట్లు సమాచారం.

అనారోగ్యంతో యువతి బలవన్మరణం

హసన్‌పర్తి: అనారోగ్య సమస్యలతో ఓ యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మడిపల్లిలో సోమవారం జరిగింది. మడిపల్లికి చెందిన తొడుగు సమ్మయ్య చిన్న కూతురు స్రవంతి (24) ఇంటిలో ఉంటోంది. స్రవంతి కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతోంది. వైద్యం చేయించినప్పటికీ వ్యాధి నయం కాకపోవడంతో జీవితంపై విరక్తిచెంది ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది.

మిర్చి వ్యాపారి సదానందం హఠాన్మరణం

ఖిలా వరంగల్: వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ మిర్చి వ్యాపారి సదానందం (53) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

కారు – బైక్ ఢీ.. ముగ్గురికి తీవ్ర గాయాలు

హసన్‌పర్తి: కారు – బైక్ ఢీకొన్న సంఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉందని కుటుంబీకులు తెలిపారు. హసన్‌పర్తి మండలం నాగారం గ్రామానికి చెందిన దద్దాల కుమార్, రావుల యాదగిరి, రావుల ప్రకాష్.. బైక్‌పై బైరాన్‌పల్లిలో జరిగిన ఓ కార్యక్రమానికి సోమవారం హాజరై తిరిగి ఇంటికి వెళ్తుండగా జాతీయ రహదారిపై వంగపహాడ్ వద్ద ప్రమాదం జరిగింది.

టీహోటల్ యజమానిపై దాడి

ఖిలా వరంగల్: ఓ వాటర్ ప్లాంట్, టీ హోటల్ యజమానిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేసిన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. వరంగల్ ఉర్సు కరీమాబాద్ ఆర్ముఖ బార్ సమీపంలో ఉమర్ వీధిలో సంగ కామేశ్వర్ వాటర్ ప్లాంట్, టీ హోటల్ యజమానిపై ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు.

వసంత పంచమి వేడుకలు



వరంగల్ శ్రీనివాసకాలనీలోని శృంగేరి శారదాంబ శంకరమఠం ప్రాంగణంలో..



ఖిలా వరంగల్: సరస్వతి అమ్మవారికి పూజలు చేస్తున్న శ్రీనివాసచార్యులు



వరంగల్ స్టేషన్ రోడ్డులోని కాశీ విశ్వేశ్వర ఆలయంలో కైలాసగిరి పూజలో..



వరంగల్ స్టేషన్ రోడ్డులోని కాశీ విశ్వేశ్వర ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసం